

భరోసా సున్నా

నాలుగైదేళ్లుగా సాగు సాయం అందక పోవడంతో ఫార్మాసిటీ బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. 10లో▸



రైతుల సందడి

భరోసా కోసం రైతులు వ్యవసాయ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. సందడి వాతావరణం కనిపించింది. 10లో▸



రైతులందరికీ..

రైతులందరికీ రైతు భరోసాను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఏఓ నర్సింహారావు తెలిపారు. 10లో▸

కూరగాయలు పండ్లతోటలు

సాగు పెరిగేలా..



ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి

- జిల్లాలో విస్తీర్ణం పెంపే లక్ష్యం
- రాయితీపై విరివిగా డ్రిప్ పరికరాలు
- ఉచితంగా నారు అందజేత
- రైతులు వినియోగించుకోవాలని సూచన



యాచారం మండలం చౌదర్‌పల్లిలో డ్రిప్ పరికరాలతో సాగవుతున్న కూరగాయలు

యాచారం: కూరగాయలు, పండ్లతోటల సాగు విస్తీర్ణం పెంచేలా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి సారించింది. ఆసక్తి కలిగిన రైతులను ప్రోత్సహించడం కోసం రాయితీ అవకాశం కల్పిస్తోంది. మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో కూరగాయలు, పండ్లతోటల పెంపకాన్ని చేపట్టి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయించి ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే సర్కార్ లక్ష్యం. రైతు కమిషన్ ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు పెంపు కోసం యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ కింద తీసుకుని ప్రోత్సాహం అందిస్తోంది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాద్‌నగర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని దాదాపు 12 వేల మందికి పైగా రైతులు 30 వేల ఎకరాలకు పైగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం పెంపుపై ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో సౌకర్యాలు కల్పించి సాగు విస్తీర్ణం పెంచేలా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ దృష్టి పెట్టింది.

మొదటగా 390 హెక్టార్లకు డ్రిప్

మొదటి ప్రాధాన్యత కింద జిల్లా వ్యాప్తంగా 390 హెక్టార్లకు గాను రాయితీపై డ్రిప్ పరికరాలు అందించేలా నిర్ణయించింది. కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే వారిలో అత్యధికంగా ఎస్సీ, బీసీ, జనరల్ రైతులే ఉంటారు. ప్రాధాన్యత కింద వారికి మేలు చేసేలా అధికారులు నిర్ణయించారు. 40 హెక్టార్ల డ్రిప్‌ను ఎస్సీ రైతులకు, 350 హెక్టార్ల డ్రిప్‌ను జనరల్ రైతులకు అందించనున్నారు. కూరగాయల పంటలకైతే రెండు ఎకరాలలోపు, పండ్లతోటలైతే పన్నెండున్నర ఎకరాలలోపు డ్రిప్ అందజేస్తారు. ఎస్సీ రైతులకైతే వంద శాతం (జీఎస్టీ చెల్లించాలి) రాయితీపై.. సన్నకారు, చిన్నకారు రైతులైతే 90 శాతం రాయితీపై అందజేస్తారు.

నాణ్యమైన నారు అందజేత

వానాకాలం సీజన్‌లో రైతులు అత్యధికంగా పలు రకాల కూరగాయల సాగుకు ఆసక్తి చూపుతారు. సరైన అవగాహన లేక స్థానికంగా ప్రైవేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన నర్సరీల్లో నారు కొనుగోలు చేసి దిగుబడి లేక తీవ్రంగా నష్టపోతున్నారు. అలాంటి వారి కోసం నాణ్యమైన నారును అందించనున్నారు. రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాదారు, పాసుపుస్తకంతో పాటు ఒక ఫొటో, ఆధార్, బ్యాంకు, ఫోన్ నంబర్లతో కూడిన వివరాలు (జిరాక్స్ ప్రతులు) ఆయా డివిజన్లలోని ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ కార్యాలయాల్లో అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి నాణ్యమైన టమాటా, మిర్చి, వంగ కూరగాయల విత్తనాలను, ఎకరాకు 8 వేల మొక్కలను అందిస్తారు.

సీఎంకు విన్నవించాం



సీఎంను కలిసి రైతుల సమస్యలు తెలియజేయడం చాలా సంతోషంగా ఉంది. జిల్లాలోని కూరగాయలు, పండ్లతోటలు సాగు చేసే రైతులకు విరివిగా డ్రిప్, యంత్ర పరికాలు ఇవ్వాలని విన్నవించాం.

– కాశమల్ల రాములు, రైతు, చౌదర్‌పల్లి

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది 390 హెక్టార్లలో కూరగాయలు, పండ్లతోటలకు డ్రిప్ పరికరాలు అందించాలని నిర్ణయించాం. నారు కోసం ఆసక్తి కలిగిన రైతులు నెల రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. వినియోగించుకోవాలి.

– సురేష్, ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి

ఫోన్ ట్యాపింగ్‌తో టార్గెట్ చేశారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

- వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తన ఫోన్ ట్యాపింగ్‌చేసి, టార్గెట్ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌తో తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఓడించాలనే ఆలోచనతో తాను మాట్లాడిన మాటలను ట్యాపింగ్ చేశారని, తనతో మాట్లాడిన నాయకులు, కార్యకర్తల సంభాషణలను బహిర్గతం చేసి ఏం సాధించారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో స్థానిక నాయకుల పాత్ర ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు టికెట్ రాదని ముందుగానే ప్రచారం చేశారంటే ఫోన్ ట్యాపింగ్ ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. చివరికి తన భార్యా పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడిన మాటలను కూడా ట్యాపింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. పట్టణంలో మంగళవారం నియోజకవర్గ గిరిజన మోర్చా ఇన్‌చార్జి మోహన్‌సింగ్ అధ్యక్షతన గిరిజన నేతల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్రం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మూడు పర్యాయాలుగా ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రవి నాయక్, లష్కర్ నాయక్, రాజు నాయక్, మోహన్ నాయక్, లింగం నాయక్, హరి భూషణ్, ఇస్నాతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రమే లక్ష్యం

- గడిచిన ఏడాదిలో 30వేల కిలోల గంజాయి సీజ్ చేశాం
- సైబర్ నేరాల అదుపులో మనమే ముందున్నాం
- రూ.185 కోట్లు రికవరీ
- డీజీపీ జితేందర్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

వికారాబాద్: డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా తెలంగాణ పోలీసులు పని చేస్తున్నారు.. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం.. అని డీజీపీ జితేందర్ అన్నారు. వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాల నివారణ, ఇసుక అక్రమ రవాణా, మతపరమైన ఘర్షణలు, నివారణ చర్యలు తదితర వాటిపై సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో 30వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గంజాయి లేదని.. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ మీదుగా సరఫరా అవుతోందన్నారు. దీన్ని కూడా సమర్థవంతంగా అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల అదుపులో దేశంలోనే రాష్ట్రం ముందుందని.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ధ్రువీకరించిందన్నారు. దీంతో మన పోలీసులపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి రెండు వందల మందికిపైగా పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. గడిచిన ఏడాది కాలంలో సైబర్ మోసాల ద్వారా కోల్పోయిన రూ.185 కోట్లు రాబట్టామని, ఈ సొమ్మును బాధితులకు తిరిగి అప్పగించామన్నారు. సైబర్ నేరాల అదుపులో మన పోలీసులు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డయల్ 100 ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. ఇటీవల ఓ సింగర్ తోపాటు ఇతరులపై కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. ఇసుక మాఫియా, జూదం, మట్కా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అట్రాసిటీ కేసుల విషయంలో పకడ్బందీగా దర్యాప్తు చేసి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐజీ సత్యనారాయణ, డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ ఎస్పీ హన్మంతరావు, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ, వీరేశ్, సీఐలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ పూనమ్

కేశంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెటర్నరీ అండ్ చైల్డ్ హెల్త్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పూనమ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ప్రతి వారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రస్తుతం డయేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, ఆరు రకాల హ్యాండ్ వాష్ టెక్నిక్‌ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నర్సింహారెడ్డి, ఫార్మసిస్ట్ లావణ్య, పీహెచ్‌ఎన్ అంజలమ్మ, ఎంపీహెచ్‌ఎస్ మేర్సీలీన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి



మొక్కలు నాటుతున్న ఏడీ జ్యోత్స్న, కమిషనర్ శంకర్‌నాయక్ తదితరులు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ఏడీ జ్యోత్స్న అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు పబ్లిక్ టాయ్‌లెట్లను మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. పలు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ నోటీసులు అందించారు. మొక్కలు నాటే కార్యక్రమం కోసం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ, పీఏఓ వరప్రసాద్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

మొయినాబాద్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 19న విద్యార్థుల ఎంపిక జరుగుతుందని మండల విద్యాధికారి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతిలో ప్రవేశాలకోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 19న మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాల ఆవరణలో జరిగే ఎంపికకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు రన్నింగ్, జంపింగ్ పోటీలతో పాటు ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డుతో హాజరు కావాలన్నారు.

ఎంపికకు ఆహ్వానం

షాబాద్: విద్యార్థులు క్రీడా పాఠశాలల్లో చేరికకు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్న క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 19న మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక జరుగుతుందని తెలిపారు.

షాద్‌నగర్‌లో క్రీడా పోటీలు

షాద్‌నగర్‌రూరల్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 19న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులకు ఉదయం 10గంటలకు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థుల వయసు 8 నుంచి 9 ఏళ్ల మధ్య ఉండాలని, 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య పుట్టినవారు అర్హులని చెప్పారు. వివరాలకు 93987 39414 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ఆరుట్ల పబ్లిక్ స్కూల్‌లో కొత్తగా అడ్మిషన్లు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

సర్కారు బడికి జై

ఆదర్శంగా ఆరుట్ల పాఠశాల

- ప్రవేశాలకు విద్యార్థుల ఆసక్తి
- రోజురోజుకూ పెరుగుతున్న అడ్మిషన్లు
- ఇప్పటికే 1,200కుపైగా కొత్త చేరికలు

మంచాల: ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వం, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు సైతం అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సోషల్ డెమొక్రటీ ఫౌండేషన్ వారు సందర్శించారు. ఇక్కడ ఆదర్శ పాఠశాల, ప్రాథమిక, ఉన్నత, ప్రీప్రైమరీ పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేశారు. స్థానిక యువకులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నారు. రూ.కోట్లలో ఖర్చు పెట్టి ఆటస్థలం, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ల ఏర్పాటు, ఆట వస్తువులు, పూర్తి స్థాయిలో ఇంగ్లిష్ మీడియం సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేకంగా విద్యార్థులకు డైనింగ్ హాల్స్, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.



విద్యార్థుల కోసం స్కూల్ బస్సు

పెరిగిన విద్యార్థుల ప్రవేశాలు

గతంలో ఉన్నత పాఠశాలలో 251 మంది ఉండగా కొత్తగా 320 మంది చేరారు. ప్రాథమిక పాఠశాలలో 45 మంది ఉండగా మరో 447 మంది అడ్మిషన్ తీసుకున్నారు. ప్రీప్రైమరీ పాఠశాలలో కొత్తగా 240 మంది ప్రవేశాలు పొందారు. ఆదర్శ పాఠశాలలో మొత్తం 430 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో 480 మంది, ఇంటర్మీడియెట్ స్థాయిలో 150 మంది ఉన్నారు. ఇలా కొత్తగా 1,207 మంది ప్రవేశాలు తీసుకున్నారు. అడ్మిషన్లు ఇంకా కొనసాగుతుండడంతో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఉపాధ్యాయుల పిల్లలు సైతం

ఇక్కడ విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలను ఇదే పాఠశాలలో చేర్పించారు. దీంతో తల్లిదండ్రుల్లో స్కూలుపై మరింత విశ్వాసం పెరిగింది. ఆరుట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు వచ్చి చేరుతున్నారు.

మా నాన్న ఇక్కడే టీచర్



మా నాన్న శ్రీకాంత్ ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఇక్కడే బోధిస్తున్నారు. నేను ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాను. మా చెల్లెలు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది.

– కంబాలపల్లి మిథున్ చక్రవర్తి, ఏడో తరగతి

అన్ని సదుపాయాలు



విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తున్నాం. పిల్లలకు బంగారు భవిష్యత్ కల్పించాలనేదే మా సంకల్పం. తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఇక్కడ అన్ని పనులు సాగుతున్నాయి.

– విదిరె స్వాతి, చైర్మన్, పేరెంట్స్ కమిటీ

సరిపడా ఉపాధ్యాయులు



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలో 19 మంది, ఉన్నత పాఠశాలలో 16, ప్రాథమిక పాఠశాలలో 7, ప్రీప్రైమరీలో 6 మంది ఉన్నారు.

– జహీర్, ఉపాధ్యాయుడు, ఆరుట్ల ప్రాథమిక పాఠశాల

నాణ్యమైన విద్య



మాపై నమ్మకంతో విద్యార్థులను చేర్పిస్తున్నారు. మా బాధ్యతగా మరింత కష్టపడి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం.

– సిద్ధగోని గిరిధర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల

వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల సందడి

దరఖాస్తులు స్వీకరించిన ఏఈఓలు


చేవెళ్ల వ్యవసాయ కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వం వానాకాలం సాగుకు రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో కొత్తగా పాస్‌పుస్తకాలు తీసుకున్న రైతులు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో రైతులు వ్యవసాయ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల హడావుడి కనిపించింది. వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓలు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ నిర్వహించారు. యాసంగి సీజన్‌లో భరోసా అందని రైతులు సైతం దరఖాస్తులు సమర్పించారు. కొత్త వారికంటే పాత రైతులు రాని వారే ఎక్కువగా వస్తుండటంతో ఏఈఓలకు రైతులకు సమాధానం చెప్పడమే సరిపోయింది. దీనికి తోడు సర్వర్ మొరాయించడంతో ఎంట్రీలు ఆలస్యమయ్యాయి.

గిరిజనుల స్థితిగతులపై సర్వే


వివరాలు సేకరిస్తున్న సర్వే అధికారులు

కద్తాల్: గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పేర్కొన్నారు. ధరి ఆబా జంజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని వాసుదేవ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కాద్యతండా, నేరేళ్లకోలుతండా, చెన్నారంతండా, సాలార్‌పూర్ గ్రామ పంచాయతీలలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లో గిరిజనులతో సమావేశాలు నిర్వహించి వారి స్థితిగతులపై సర్వే చేశారు. విద్యుత్, మరుగుదొడ్లు, అసైన్డ్ భూములు, సాగు వివరాలు, వైద్య సేవలు, అంతర్గత రహదారుల వివరాలు తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. గిరిజనుల సామాజిక ఆర్థికాభివృద్ధికి కోసం ధరి ఆబా జంజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద కృషి చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాములు, సర్వే అధికారి బీమ్లా నాయక్ ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా..

వ్యక్తి అదృశ్యం


కుమారుడితో మామిడి శివ(ఫైల్)

కేశంపేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాజ్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన మామిడి శివ అలియాస్ సిటీ కేబుల్ శివ(32) ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా వరంగల్‌లో ఉన్నట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. శివ ఆత్మహత్య చేసుకుంటున్నాంటూ పెట్టిన సెల్ఫీ వీడియో చూస్తూ కుటుంబీకులు, మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. శివ తల్లి అనుసూయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పు చేస్తే క్షమించండి

'హలో.. హాయ్.. ఇన్ని రోజులు నాకు సహకరించిన ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు, శ్రేయోభిలాషులు, స్కూల్, ఇంటర్ ఫ్రెండ్స్, అమ్మనాన్నలకు ప్రత్యేక ధన్యవాదాలు. అభివృద్ధిలో ఆర్థికంగా అన్ని రకాలుగా సహకరించిన ప్రతాపన్న గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఫ్రెండ్స్ మీఅందరిని వదిలేసి వెళ్లిపోతున్నందుకు బాధగా ఉంది. తెలిసీతెలియక మీతో అమర్యాదగా మాట్లాడి ఉంటే, తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి'అంటూ స్పెల్ఫీ వీడియో పోస్టు చేశాడు. ఈ వీడియోను చూస్తూ మిత్రులు, కుటుంబీకులు కన్నీటి పర్యంతం అయ్యారు.

మంగళాభట్‌కు కన్నీటి వీడ్కోలు

బంజారాహిల్స్: ప్రముఖ కథక్ నాట్యగురు మంగళాభట్ అంత్యక్రియలు మంగళవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అభిమానులు, శిష్యుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11 మిథిలానగర్‌లోని వారి స్వగృహం వద్ద ఆమె భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె శిష్యులు వందలాది మంది కలిసి 16 బీట్స్‌లో నట్టువాంగం కథక్ 'పడంత్' జతులు చదువుతూ తాళం వేస్తూ కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె గురువు దుర్గాలాల్ కుమారులు పండిట్ మోహిత్‌లాల్, మోనాలాల్‌తో పాటు ఢిల్లీ, ముంబాయి నుంచి స్నేహితులు, నృత్య కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి చివరి చూపు చూసి నృత్య నివాళులర్పించారు.

స్వాధీనంలో ఉన్నా.. భరోసా సున్నా

- పట్టాభూములు టీజీఐఐసీ పేరిట మార్చి పొట్టకొడుతున్నారు
- నాలుగేళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు
- భూములు తీసుకున్నాక రెవెన్యూ సదస్సులు ఎందుకు
- బహిష్కరించిన నానక్‌నగర్, తాడిపర్తి రైతులు


నిషేధిత జాబితాలో ఉన్న నక్కర్తమేడిపల్లి పట్టా భూమి

యాచారం: నాలుగైదేళ్లుగా సాగు సాయం అందక ఫార్మాసిటీ బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. భూములు తమ స్వాధీనంలో ఉన్నా రికార్డుల్లో లేక ఇబ్బంది పడుతున్నారు. తాము సాగు చేసుకుంటున్న పట్టాభూముల రికార్డులు తమ పేరిట మార్చి రైతు భరోసా, బ్యాంకు రుణాలు, క్రయ విక్రయాలు చేసుకునేలా సహకరించాలని ప్రాధేయపడినా కనికరించేవారే కరువయ్యారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి పది వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించి 7,500 ఎకరాల అసైన్డ్, పటా భూములు సేకరించింది.

టీజీఐఐసీ పేరిట 2,200 ఎకరాలు

ఫార్మాసిటీకి భూ సేకరణ సమయంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు పట్టా భూములు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో 2,200 ఎకరాలను టీజీఐఐసీ పేరిట మార్చేశారు. రాత్రికి రాత్రే అవార్డులు పాస్ చేసి పరిహారాన్ని స్పెషల్ అథారిటీలో జమ చేశారు. ఆ భూ రికార్డులను నిషేధిత జాబితాలో పెట్టడంతో బీఆర్‌ఎస్ హయాంలోని రైతుబంధు, కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రైతు భరోసాతో పాటు బ్యాంకు రుణాలు, విరాసత్‌లకు అవకాశం లేకుండా పోయింది. టీజీఐఐసీ పేరిట మార్చిన భూ రికార్డులను రైతుల పేర్లపై మార్చాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారుల్లో చలనం లేదు.

3,290 మందికి భరోసా బంద్

మండల పరిధిలోని 24 పంచాయతీల్లో 19,493 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుండగా 16,053 మందికి మాత్రమే నగదు జమకానుంది. 2,200 ఎకరాల పట్టా భూముల రికార్డులు టీజీఐఐసీ మీద మార్చడంతో బీఆర్‌ఎస్ హయాంలో మూడేళ్ల పాటు, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ హయాంలో రెండు దఫాలుగా రైతు భరోసా నిధులు అందడం లేదు. రుణమాఫీ సైతం కాకపోవడంతో రుణాలు బకాయి పడ్డారు. ఈ దఫా సైతం రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లోని రైతులు రెవెన్యూ సదస్సులను బహిష్కరించారు.

భూ రికార్డుల మార్పు సరికాదు



తమ కుటుంబ సభ్యుల పేరిట 30 ఎకరాలకు పైగా పట్టా భూమి ఉంది. ఫార్మాసిటీకి భూములు ఇవ్వడం లేదని టీజీఐఐసీ పేరు మీద మార్చేశారు. తమ అంగీకారం లేకుండానే భూ రికార్డులు మార్చడం సరికాదు. సాగుకు పెట్టుబడి లేక ఇబ్బంది పడుతున్నాం. అందుకే రైతు రెవెన్యూ సదస్సు బహిష్కరించాం.

– ముత్యాల వెంకట్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

రైతులు ఫిర్యాదు చేస్తున్నారు



నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో నిషేధిత జాబితాలో ఉన్న 2 వేల ఎకరాలకు పైగా పట్టా భూములకు రైతు భరోసా నిధులు జమ కావడం లేదని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో మంగళవారం నిర్వహించాల్సిన రెవెన్యూ సదస్సులను ఆ గ్రామాల రైతులు బహిష్కరించారు. భూములే పోయాక భూ సమస్యలెక్కడివి. ఇక రెవెన్యూ సదస్సులు ఎందుకు అంటున్నారు. టీజీఐఐసీ పేరిట ఉన్న భూములను తమ పేరిట మార్చాలని వినతిపత్రాలు ఇచ్చారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

బైక్ ఢీకొట్టడంతో వాచ్‌మెన్ దుర్మరణం

కడ్తాల్: రోడ్డు ప్రమాదికి గురైన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన వడ్డెపల్లి శ్రీనివాస్(54), భార్య ఉమతో కలిసి 15 రోజుల క్రితం వలసవచ్చి మండల కేంద్రానికి సమీపంలోని వికాస్ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్ పనికి కుదిరాడు. సోమవారం సాయంత్రం దంపతులు కూరగాయల కొనుగోలుచేసి తిరిగి నడుచుకుంటూ వెళ్తుండగా రాఘవేంద్ర హోటల్ సమీపంలో హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న ఓ బైక్ శ్రీనివాస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి క్షతగాత్రుడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంగళవారం మృతుడి భార్య ఉమ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

భూ భారతితో రైతులకు విముక్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: ధరణితో గత పదేళ్లుగా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అది ఒక నల్ల చట్టమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మహాలింగాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు నరకం అనుభవించారని, దానిని తొలగించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు. గతంలో అధికారులు గ్రామాల్లోకి వచ్చేవారు కాదని, రైతు ప్రభుత్వం వచ్చాక మార్పు వచ్చిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఏకకాలంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఆర్‌ఐ సుప్రియా, పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, చంద్రయ్య, రఘునందన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న గడువు

దోస్త్ రిజిస్ట్రేషన్లకు మూడో విడత అవకాశం

ఇబ్రహీంపట్నం: దోస్త్ మూడవ విడత రిజిస్ట్రేషన్లకు ఈ నెల 19 అవకాశం ఉన్నట్లు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక తెలిపారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీ.ఎస్సీ మొదటి సంవత్సరం కోర్సుల్లో చేరుటకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ ఇచ్చుకోవాలని సూచించారు. ఇప్పటికే సీట్లు దక్కించుకున్న విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలని లేదంటే సీటు కోల్పోతారని చెప్పారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్

బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్



ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేడు రైతులను పూర్తిగా విస్మరించిందని బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఆచరణలో పెట్టడం లేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేయకుండానే రైతు భరోసాతో కొత్త మోసానికి తెరలేపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా ఇస్తున్నామని చెప్పి భువనగిరి పార్లమెంట్‌లోని ఇబ్రహీంపట్నం మండలం, అబ్దుల్లాపూర్‌మెంట్ మండల రైతులకు మొండిచేయి చూపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు దగ్గరా ఉన్న మండలాలకు భరోసా వేయకపోవడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో రైతులు లేరా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీసం అవగాహన లేదన్నారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 25 వేలకు పైగా రైతులకు వెంటనే రైతు భరోసా ఇవ్వాలన్నారు. లేని పక్షంలో బీఆర్‌ఎస్ పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలోనే రైతులు సుఖంగా ఉన్నారని గుర్తుచేశారు. రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ పతనం కావడం ఖాయమన్నారు.

కృతజ్ఞతలు


వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ప్రసన్న కుమార్ శర్మ

మంచాల: ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పేరూరి ప్రసన్నకుమార్ శర్మ మంగళవారం నగరంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ శర్మ మాట్లాడుతూ.. నూతనంగా నియామకం కావడంతో వేం నరేందర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

వలస కూలీ దారుణ హత్య

మొయినాబాద్: బతుకుదెరువుకు వలస వచ్చిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కీర్తినగర్‌కు చెందిన దుర్గేష్ సాహు(38) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి మొయినాబాద్ ప్రాంతానికి వలస వచ్చాడు. కనకమామిడిలోని ఓ ఫాంహౌస్‌లో ఉంటూ కూలి పని చేసేవారు. ఫాంహౌస్‌లో అతని కొడుకు విలాస్‌సాహు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం భార్య మరణించింది. విలాస్‌సాహు వారం రోజుల క్రితం ఊరికి వెళ్లాడు. కాగా సోమవారం రాత్రి కనకమామిడి సమీపంలో ఉన్న స్క్రాప్ ఫాం వెంచర్‌లో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు దుర్గేష్ సాహుపై దాడి చేసి తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

37 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు హైదరాబాద్ పోలీసులు. సైబర్ నేరాలు, నేరస్తులను సీరియస్ తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆరు రాష్ట్రాల్లో స్పెషల్ ఆపరేషన్స్ నిర్వహించి 37 మంది సైబర్ నిందితులను పట్టుకున్నారు. రూ.14.54 కోట్ల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఆయా నిందితులపై దేశవ్యాప్తంగా 178 కేసులు ఉండగా.. తెలంగాణలో ఏకంగా 74 కేసులు ఉన్నాయి.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

77 ఫోన్లు స్వాధీనం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి

కంటోన్మెంట్: రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయినట్లు నటిస్తూ...జాలిపడి వారి వద్దకు వచ్చే వాహనదారులు, ప్రజల సెల్‌ఫోన్లు దొంగిలించే ముఠా ఆటకట్టించారు బోయిన్‌పల్లి పోలీసులు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.25 లక్షలు విలువ చేసే 77 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గంటా చిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడే ముఠాతో సంబంధాలు ఏర్పడ్డాయి. అనంతరం ఒడిశాకు చెందిన ప్రధాన్ శ్రీకాంత్, ఆవుల గోపి రావులతో కలిసి ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ దొంగతనాలకు అలవాటు పడ్డారు. 2017 నుంచి మూడు కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు, ప్రయాణికుల నుండి సెల్ ఫోన్లు చోరీ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బోయిన్‌పల్లిలో తాడ్‌బండ్ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా సెల్‌ఫోన్ స్నాచర్లుగా తేలినట్లు ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి వెల్లడించారు. ఇటీవల జరిగిన సెల్‌ఫోన్ దొంగతనాలకు సంబంధించి సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం ఈ ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు తులసీదాస్, రాజేశ్, మురళి, మనోహర్ రెడ్డి, శివలను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్, అడ్మిన్ ఎస్‌ఐ శివశంకర్ పాల్గొన్నారు.

రైతులందరికీ భరోసా అందిస్తాం

- జిల్లా వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రూ.127.79 కోట్లు
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



షాద్‌నగర్‌రూరల్: జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసాను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఈ నెల 16, 17న జిల్లా వ్యాప్తంగా 1,87,255 మంది రైతులకుగాను రూ.127.79 కోట్ల రైతు భరోసా సాయం అందిచామన్నారు. కొత్త పాస్‌బుక్ ఉన్న రైతులు బ్యాంక్ ఖాతా వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి, మండల వ్యవసాయ అధికారికిగానీ అందజేయాలని సూచించారు. బ్యాంక్ అకౌంట్ నంబర్ తప్పుగా ఉండి రైతు భరోసా సహాయం అందని రైతులు వారి ఖాతా వివరాలను మండల వ్యవసాయశాఖ అధికారులకు అందజేయాలని కోరారు.

మండలాల వారీగా భరోసా వివరాలు

మండలం	రైతులు	నగదు జమ
ఆమనగల్లు	7,771	రూ.5,35,81,670
కడ్తాల్	9,146	రూ. 6,66,49,287
మాడ్గుల్	17,247	రూ.14,31,95,477
తలకొండపల్లి	14,566	రూ.11,09,83,897
చేవెళ్ల	15,529	రూ.9,78,11,021
మొయినాబాద్	8,447	రూ.4,99,75,144
షాబాద్	14,336	రూ.9,89,99,355
శంకర్‌పల్లి	12,195	రూ.7,13,80,424
మంచాల	11,281	రూ.6,38,16,055
యాచారం	9,446	రూ.6,68,75,449
కందుకూరు	11,366	రూ.7,65,29,010
ఫరూఖ్‌నగర్	14,306	రూ.9,04,75,391
జిల్లేడ్ చౌదరిగూడ	9,002	రూ.6,41,11,479
కేశంపేట	12,839	రూ.9,39,82,948
కొందుర్గు	8,783	రూ.6,16,75,942
కొత్తూరు	5,143	రూ.2,97,77,711
నందిగామ	5,852	రూ.3,80,52,156